చదువు.. చింత



భూపాలపల్లి జిల్లాలో 28 పాఠశాలల మూసివేత

- విద్యార్థులున్నా.. టీచర్ల కరువు
- 20,710 మందికి 1,430 మంది
- దీనస్థితిలో ఏకోపాధ్యాయ పాఠశాలలు
- అసలే ఉపాధ్యాయులు లేని బడులు నాలుగు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 18: అసలే వెనుకబడిన మారుమూల జిల్లా భూపాలపల్లి. పైగా ప్రభుత్వ పాఠశాలలు అధికంగా ఉన్న ప్రాంతం. ఇక్కడ పేద పిల్లలే ఎక్కువ. చదువులు మాత్రం తక్కువ. విద్యార్థులు అధికంగా ఉన్న కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండటం లేదు. మరికొన్ని చోట్లా అసలు ఉపాధ్యాయులే లేరు. ఏకోపాధ్యాయ పాఠశాలలు అనేకం ఉండడం వల్ల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారింది. అంతేకాదు.. అరకొర సౌకర్యాలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. జిల్లాలోని 12 మండలాలకు ముగ్గురు మాత్రమే ఎంఈవోలు ఉన్నారు. వారు కూడా ఇన్‌చార్జిలే. .

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మండల ప్రజాపరిషత్ పాఠశాలలు 317 ఉన్నాయి. మండల ప్రాథమికోన్నత పాఠశాలలు 44, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 69 ఉన్నాయి. మూతపడిన పాఠశాలలు 28 ఉండగా నాలుగు పాఠశాలల్లో అసలే ఉపాధ్యాయులు లేరు. ఆయా పాఠశాలల్లో మొత్తంగా 20,710 మంది విద్యార్థులు ఉండగా 1,430 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ జిల్లాకు మంజూరైన పోస్టులు 1,804 కాగా ప్రస్తుతం 1,430 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఇంకా 374 మంది ఉపాధ్యాయులను నియామకం చేయాల్సి ఉంది. అంతేకాదు.. 124 పాఠశాలల్లో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారు.

ఇదేం దుస్థితి ?!

మహాముత్తారం మండలంలోని రెడ్డిపల్లి ఎంపీపీఎస్‌లో 30 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ అక్కడ ఒక్క టీచర్ కూడా లేదు. ఇక్కడ రెండు పోస్టులు ఉండగా ఒకరు మెడికల్ లీవ్‌లో వెళ్లి మూడేళ్లయ్యింది. మరొకరు బదిలీ అయ్యారు. లింగాపూర్ ఎంపీపీఎస్‌లో 27 మంది విద్యార్థులు ఉండగా ఒక్క రెగ్యులర్ టీచర్ కూడా లేకపోవడంతో సీఆర్‌పీచే తరగతులు జరుగుతున్నాయి. కనుకునూరులోని పీఎస్‌లో 29 మంది విద్యార్థులు ఉండగా ఒక్కరే టీచర్ ఉన్నాడు. ఆయన కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. యూపీఎస్ నర్సింగాపూర్‌లో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కడ ఏడుగురు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ, ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారు. ఆమె కూడా బదిలీ అయితే పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అలాగే స్తంబంపల్లి ఎంపీపీఎస్‌లో 40 మందికి ఒక్కరే టీచర్ ఉన్నారు. మహదేవపూర్ మండలం సూరారం ఎంపీపీఎస్‌లో 56 మంది విద్యార్థులు ఉండగా ఒక్కరే ఉన్నారు. యూపీఎస్ బెగుళూరులో 50 మందికి ఒక్కరే ఉన్నారు. పలిమెల మండలంలోని బూర్గుగూడెం ఎంపీపీఎస్‌లో 20 మంది విద్యార్థులు ఉండగా ఒక్క ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. పలిమెలలో ఎంపీయూపీఎస్‌లో 85 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. అయితే... ఇక్కడ ఏడు తరగతులకు 26 పిరియడ్లు చెప్పాల్సి ఉండగా ఒకే టీచర్‌పై పనిభారం పడుతోంది. ఇద్దరు, ముగ్గురు చేసే పనిని ఒకరే చేస్తున్నారని తెలుస్తోంది. అలాగే ప్రాథమిక పాఠశాల దశలో 18 పీరియడ్లు ఉంటాయి. అయితే కనీసం ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులైన ఉండాలి ఇక్కడ. కానీ, ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో ఒక్క ఉపాధ్యాయుడు పనిచేసే పాఠశాలలు 128 ఉన్నాయంటే.. విద్యా వ్యవస్థపై ప్రభుత్వాలు ఎంత అశ్రద్ధ వహిస్తున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చని పలువురు విమర్శిస్తున్నారు.

అరకొర సౌకర్యాలతో సతమతం

జిల్లాకు గత ప్రభుత్వం రూ.2.50 కోట్లు, ప్రస్తుత ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరుచేసి పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ ఇంకా అవి అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. ముఖ్యంగా మరుగు దొడ్లు నిర్మించిన చోట కూడా విద్యార్థులకు అవి ఉపయోగపడడం లేదు. విద్యార్థినులు ఎక్కువగా ఉన్న జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తీవ్ర సమస్య తలెత్తుతోంది. పదుల సంఖ్యలో పాఠశాలల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేవు. కొన్ని చోట్లా ఉన్నా అవి ఉపయోగపడటం లేదు. ఏ పాఠశాలలోనూ స్కావెంజర్లు లేకపోవడంతో పారిశుధ్యం లోపిస్తోంది.

ఉన్నతాధికారులూ కరువే...

జిల్లాల వేర్పాటు అనంతరం ఇప్పటి వరకు గడిచిన పదేళ్లలో మొదటగా వచ్చిన రెగ్యులర్ డీఈవో మినహా ఇప్పటి వరకు వచ్చిన వారిలో అంతా ఇన్‌చార్జిలే వచ్చారు. ప్రస్తుతం ఉన్న డీఈవో కూడా ఏడీ నుంచి ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు. విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండటంతో కొంతమంది ఉపాధ్యాయులను ప్రత్యేకంగా నియమించుకున్నారు. పైగా డీప్యూటీ డీఈవో కూడా లేదు. విద్యా వ్యవస్థ ఇలావుంటే.. పేదలకు చదువులెట్లా అబ్బేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆడపడుచుల అను'బంధన్'

- నేడు రాఖీ పర్వదినం

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 18: అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రక్షబంధన్. సోదరులపై తమకు ఉన్న ఆత్మీయతను చాటుకుంటారు ఆడపడుచులు. ఎల్లవేళలా రక్షణ కల్పిస్తాడనే నమ్మకం కలిగి ఉంటారు. అందుకు కంకణబద్ధులు కావాలని కాంక్షిస్తూ అందుకు గుర్తుగా మణికట్టుపై రాఖీ కడతారు. ఏడాదికోసారి జరుపుకొనే ఈ పర్వదినం వచ్చేసింది. సోమవారం అత్యంత ఘనంగా జరగనుంది. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. ఈ పండుగ శ్రావణమాసం పౌర్ణమి నాడే రావడం విశేషం. ఇది ముఖ్యంగా హిందువులు, జైనుల పర్వదినంగా పెద్దలు చెబుతారు. అయితే.. పలు చోట్లా కులమతాలకు అతీతంగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు. ఈ పండుగ నేపథ్యంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో రాఖీలతోపాటు స్వీట్లు కొనుగోలు చేశారు. దీంతో దుకాణాలు కళకళలాడాయి.



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ

మహదేవపూర్, ఆగస్టు 14 : మహదేవపూర్ మండలంలోని పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాస ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో ఉదయం నుంచి పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీసగఢ్‌రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఈవో ఇంట్లో సోదాలు జరుపుతున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ వలలో 'శ్రీముసలమ్మ' ఈవో

- దుకాణదారుడి నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్
- తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 18: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలోని శ్రీముసలమ్మ ఆలయ ఈవో భోగోజు భిక్షమాచారి ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ దుకాణ టెండరుదారుడి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

గుంజేడు శ్రీముసలమ్మ ఆలయం ఆవరణలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కిరాణ షాపు ఏర్పాటు చేశారు. గత మే 29న టెండరులో గుంజేడుకు చెందిన పాల్తి రాములు అనేవ్యక్తి ఈ దుకాణాన్ని దక్కించుకున్నాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన నల్లెపు సాంబయ్య ఈ షాపును నడిపిస్తున్నాడు. ఈ దుకాణంలో మద్యం అమ్ముతున్నారని గత జూన్ 11న షాపును దేవాదాయ శాఖ సీజ్ చేసింది. ఈ క్రమంలో దుకాణాన్ని మళ్లీ తెరుచుకోవడానికి సాంబయ్య దేవాదాయశాఖ ఉన్నతాధికారి నుంచి అనుమతి తీసుకువచ్చాడు. అయితే షాపు పునరుద్ధరణకు లంచం ఇవ్వాలని ఈవో భిక్షమాచారి నెల రోజులుగా డిమాండ్ చేస్తున్నాడు. లేకుంటే మళ్లీ షాపును సీజ్ చేయిస్తానని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఈ విషయంపై సాంబయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో ఆదివారం మధ్యాహ్నం గుంజేడుకు వచ్చిన అధికారులు.. సాంబయ్యకు రూ.20వేలు ఇచ్చి ఈవో భిక్షమాచారి ఇప్పించారు. ఈవో రూ.20వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని కెమికల్ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం భిక్షమాచారిని కష్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్‌లు శ్యాంసుందర్, రాజు పాల్గొన్నారు.

మరిపెడోలోని ఈవో ఇంట్లో తనిఖీలు

మరిపెడ: మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో ఆదివారం రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవోగా పనిచేస్తున్న భిక్షమాచారి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఈవో ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. ఏసీబీ ఇన్స్‌పెక్టర్ ఎస్.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడలోని ఈవో ఇంట్లో రూ.70వేలు నగదు, 270 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారు అభరణాలు లభించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఆయన వెంట ఏసీబీ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పాపన్న జీవితం స్ఫూర్తిదాయకం

- మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం
- జయంతి ఉత్సవాల్లో మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ప్రజ లు, సమాజం, ఉమ్మడి హక్కుల కోసం పోరాడిన పాపన్న చరిత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ములుగు కలెక్టరేట్ సమావేశపు మందిరంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలు జరిగాయి. కలెక్టర్ టీఎస్. దివాకరతో కలిసి పాపన్నగౌడ్ చిత్రపటానికి సీతక్క పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ప్రతి ఒక్కరూ మహనీయుల జీవిత చరిత్రను, వారి త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. మరచిపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ ప్రాంతంలోని ఖిలాషాపూర్ గ్రామంలో జన్మించారని, పశువుల కాపరిగా ఉంటూ రాజుల సైన్యాలను, వారి ఆగడాలను ఎదిరించి ఉమ్మడి హక్కుల కోసం పోరాడారని అన్నారు. అన్యాయాలను ఎదిరించిన ఆయన జీవిత చరిత్ర మనకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో గౌడన్నలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆమె తెలిపారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చేసిన పోరాటాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక గౌడన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం మంత్రి సీతక్క కలెక్టర్ దివాకరతో పాటు కల్లుగీత కార్మికులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా కల్లుగీత కార్మికులకు 100 కాటమయ్య రక్షక కవచాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, సీఈవో సంపత్‌రావు, ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్, బీసీ కులస్థులు, బీసీ సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



కలెక్టర్ దివాకరకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

కలెక్టర్‌కు రాఖీ కట్టిన సీతక్క

సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సీతక్క అనంతరం అదే వేదికపై రక్షా బంధన్ వేడుకలు జరిపారు. కలెక్టర్ దివాకరకు శాలువా కప్పి రక్ష కట్టారు. 'రాఖీ కట్టిన మీరు ఇక నుంచి నాకు అక్క అయ్యారు..' అని కలెక్టర్ అనడంతో మంత్రి స్పందించారు. 'రాఖీ గొప్పదనమే ఇది.. బంధాలు, అనుబంధాలను కాపాడుతుంది.. పటిష్టం చేస్తుంది'.. అని అన్నారు. దీంతో కలెక్టర్ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్‌ను నిర్వహించిన మంత్రి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు రాఖీలు కట్టారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

మేడారం, ఆగస్టు 18 : పురుగుమంది తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బండ కృష్ణ(45)కు భార్య సుశీల, కుమారులు రవి, శివ ఉన్నారు. పదెకరాల భూమి ఉంది. దీనిపై వ్యవసాయం చేసుకుంటూ కుటుంబానికి పోషించుకుంటున్న కృష్ణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రెండు పంటలు ధ్వంసమై నష్టపోవడం, ఇటీవల చిన్న కుమారుడు అనారోగ్యం బారిన పడటంతో రూ. 8 లక్షల అప్పు అయ్యింది. దీంతో మనస్తాపం చెందిన కృష్ణ ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బండ కృష్ణ (ఫైల్)

తండ్రిని కడతేర్చిన కొడుకు

- ఆస్తి కోసం ఘాతుకం
- ములుగు జిల్లాలో ఘటన

ములుగు రూరల్ ఆగస్టు 18: కన్న తండ్రిని కడతేర్చాడు ఓ కొడుకు. ఆస్తి కోసం మెడకకు తాడు బిగించి చంపాడు. ఈ సంఘటన ములుగు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..

ములుగు మండలం మల్లంపల్లి పంచాయతీ శివారు హుమాయూన్‌నగర్‌కు చెందిన ఓరుగంటి మహంకాళి (75)కి కొడుకు రమేష్, కూతురు కొమురమ్మ ఉన్నారు. కొమరమ్మ కుమారుడికి, రమేష్ కూతురితో వివాహం చేయాలని గతంలో నిశ్చయించారు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల వారు కట్నకానుకలు మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే తమకు ఉన్న ఐదెకరాల భూమిలో కూతురికి, కుమారుడికి చెరు సగం (రెండున్నర ఎకరాల చొప్పున) పంచాలని మహంకాళి భార్య ఐలమ్మ నిర్ణయించింది. దీన్ని కుమారుడు అభ్యంతరం చెప్పాడు. తన స్థోమతను బట్టి కట్నకానుకలు ఇచ్చుకుంటాను గానీ, దానికి కింద రెండున్నర ఎకరాలు సోదరి కుటుంబానికి ఇచ్చేది లేదని తేల్చిచెప్పాడు. మొత్తం ఆస్తిని తనకే రాసివ్వాలని, అందులోంచి ఎకరం మాత్రమే కట్నం కింద ఇస్తానని అన్నాడు. దీంతో ఈ పెళ్లి సంబంధం రద్దు అయ్యింది. ఈ క్రమంలోనే మహంకాళి భార్య ఐలమ్మ మృతి చెందింది. ఆ తర్వాత మొదట అనుకున్న ప్రకారం తనకు రెండున్నర ఎకరాలు ఇవ్వాల్సిందేనని మహంకాళి కూతురు కొమురమ్మ పట్టుబట్టింది. దీంతో రెండు కుటుంబాల మధ్య గొడవలు మొదలయ్యాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఈ క్రమంలోనే మూడెకరాల భూమిని మహంకాళి కుమారుడు రమేష్ తన పేర పట్టా చేయించుకున్నాడు. మరో ఎకరం తన భార్య పేర రాయించాడు. ఎకరం మాత్రమే తండ్రి పేర ఉంచాడు. అనంతరం అది కూడా తన పేరిట పట్టా చేయించాలని తండ్రిపై రమేష్ ఒత్తి చేయసాగాడు. ఇందుకు అతడు ఒప్పుకోలేదు. ఎకరం భూమిని కూతురు కొముమర్మ పేర రిజిస్ట్రేషన్ చేయిస్తానని అన్నాడు. దీంతో కోపాన్ని పెంచుకున్న రమేష్ తన ఇంటి పక్కనే నివసించే తండ్రి ఇంట్లోకి వెళ్లి శుక్రవారం రాత్రి నిద్రలో ఉన్న అతడిని గుట్టుచప్పుడు కాకుండా మెడపై తాడు బిగించి చంపాడు. శనివారం మధ్యాహ్నం మహంకాళి ఇంట్లోకి కోతులు వెళ్లడంతో వాటిని తరిమేందుకు రమేష్ కూతురు ఇంట్లోకి వెళ్లింది. తాతయ్య విగతజీవిగా ఉండటాన్ని గమనించింది. బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి కూతురు కొమురమ్మ ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.



మహంకాళి మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

- హెల్మెట్ వెంట ఉన్నా ధరించకపోవడంతో తలకు తీవ్ర గాయాలు

గోవిందరావుపేట, ఆగస్టు 18: మండలంలోని సోమలగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బుస్సాపూర్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. హబీబ్‌బీ, రహ్మత్ అలీ దంపతుల కుమారుడు అఫ్జాద్ అలీ(18) గ్రామానికి చెందిన ఓ పాడి రైతు వద్ద పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి పాల క్యాన్లను తీసుకొని ద్విచక్రవాహనంపై గోవిందరావుపేటకు బయల్దేరాడు. ఈక్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అఫ్జాద్ అజాగ్రత్తే అతడి ప్రాణాలమీదికి తెచ్చింది. తనతోపాటు హెల్మెట్ తీసుకువెళ్లినప్పటికీ పెట్టుకోకపోవడంతో ప్రమాదంలో తీవ్ర గాయాలపాయ్యాడు. ఒకవేళ హెల్మెట్ ధరించి ఉంటే తలకు రక్షణ ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడేవాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పస్రా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అఫ్జాద్ మృతదేహం

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 18: మండలంలోని నూగూరు గ్రామంలో పిచ్చికుక్క ఏడుగురిని దాడిచేసిన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం పిచ్చికుక్క వీధుల వెంట తిరుగుతూ ఇళ్ల బయట ఉన్న ఇండ్ల ముత్యాలు, ఇండ్ల వెంకటేశ్, మూకల మాణిక్యం, ఇండ్ల లక్ష్మయ్య, పెద్ది లక్ష్మయ్య, మేకల శిరీష, మధుప్రియను గాయపరిచింది. దీంతో వారిని స్థానికులు వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన పెద్ది లక్ష్మయ్య, ఇండ్ల వెంకటేశ్‌ను మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పర్లపల్లిలో మహిళపై..

మొగుళ్లపల్లి: ఓ మహిళలను ఆదివారం మధ్యాహ్నం పిచ్చికుక్క తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని పర్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని దురిశెట్టి శశికళ మధ్యాహ్నం తన ఇంటి ఆవరణలో నిల్చుని ఉండగా ఒక్కసారిగా పిచ్చికుక్క ఆమెపై దాడిచేసి కుడికాలును తీవ్రంగా గాయపరిచింది. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు చేరుకుని కర్రలతో కుక్కను తరిమేశారు. దీంతో శశికళను చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో రోజురోజుకూ పిచ్చికుక్కలు గ్రామస్థులతోపాటు పశువులపై దాడులు చేస్తున్నాయని, నాలుగురోజుల వ్యవధిలో ముగ్గురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బీజేపీ జిల్లా కమిటీ ఎన్నిక


ములుగు కలెక్టరేట్, ఆగస్టు 18: భారతీయ జనతాపార్టీ జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులుగా అడప భిక్షపతి, జినుకల కృష్ణాకర్‌రావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, మల్లెల రాంబాబు, చెవుగాని స్వప్న, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా శీలమంతుల రవీంద్రాచారి, భర్తపురం నరేష్, అసెంబ్లీ కన్వీనర్‌గా జాడి వెంకట్, సెక్రటరీలుగా వైద్యుల తిరుపతిరెడ్డి, కొత్త సుధాకర్‌రెడ్డి, మేడిశెట్టి ఓమ్రా, లింగంపల్లి శ్రీనివాసరావు, పొదెం రవీందర్, రుద్రారపు సురేష్, అట్లూరి రఘురాం, చల్లూరి మహేందర్, స్పోక్ పర్సన్లుగా సూర్యదేవర విశ్వనాథ్, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ట్రెజరర్‌గా గంగిశెట్టి రాజ్‌కుమార్, ఆఫీస్ సెక్రటరీగా దొంతిరెడ్డి రవిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చినుకమారి శ్రీనివాస్, పాలకుర్తి సాయిబాబా, జాటోత్ ధరమ్ సింగ్, వీరన్‌కుమార్, ఎల్కతుర్తి శ్రీహరి ఎన్నికయ్యారు.

అనంతరం జిల్లా అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం బూత్‌స్థాయిలో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు.



ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు







చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

వేలేరు మండలం శాలపల్లి యువకుడి ఆత్మహత్య

వేలేరు, ఆగస్టు 18: వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని పంటలను సాగు చేయగా ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో పాటు పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురైన యువ రైతు పురుగుల మందుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆదివారం తెల్లవారు జామున ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఏ సురేష్ తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా వేలేరు మండలం శాలపల్లి గ్రామానికి చెందిన దామెర సమ్మయ్య- కోమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తండ్రి దామెర సమ్మయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం పెద్ద కుమారుడైన దామెర అనిల్ కుమార్ (31) పై పడింది. తమ్ముడు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అలాగే చెల్లెలు వివాహాన్ని ఇటీవలచేశాడు. ఎలాంటి జీవనోపాధి లేకపోవడం, ఎలాంటి ఆస్తులు సైతం లేవు. కేవలం ఇళ్లు మాత్రమే ఉంది. ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. గత మూడు సంవత్సరాలుగా అందులో పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఇందులో ఆశించిన మేరకు పంట రాకపోవడంతో సుమారుగా రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీనికి తోడు కుటుంబ భారంతో మరో రూ.3.50 లక్షలు, మొత్తం రూ. 6.50 లక్షల వరకు అప్పులైయ్యాయి. దీంతో చేసిన అప్పుల ఎలా తీర్చాలని మరోవేదనకు గురైయ్యాడు. ఈక్రమంలో శనివారం అర్థరాత్రి ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గమనించిన బంధువులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు, మృతునికి వివాహం కాలేదు. దీంతో మృతుడి తల్లి దామెర కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దామెర అనిల్‌కుమార్ (ఫైల్)







టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రంజిత్



వరంగల్ లీగల్, ఆగస్టు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా హనుమకొండ పట్టణానికి చెందిన న్యాయవాది కూనూరు రంజిత్ నియమితులయ్యారు. టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సస్పెన్షన్

మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రవీంద్రశర్మకు బాధ్యతలు

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం హైకోర్టు ఉత్వర్వులు జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూ రు కోర్టు జడ్జి మట్ట సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఆయన స్థానంలో జనగామ జిల్లా కోర్టు జడ్జి బి.రవీంద్రశర్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది.

బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.







హరికథా గాన సరస్వతి

- నాలుగు దశాబ్దాలుగా కళారంగంలో తనదైన ముద్ర
- ఒడిదొడుకులను ఎదురైనా కళామతల్లి సేవలోనే..

లక్ష్మీనారాయణ భాగవతార్



మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య చేతుల మీదుగా సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ



జనగామ కల్చరల్, ఆగస్టు 18: హరికథ తెలుగువారి విశిష్ట ప్రక్రియ. రాగ - తాళ - హావ - భావ ప్రకటనలతో శ్రోతలను, ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో దానికదే సాటి. జానపదులకు, పండితులకు అందరికీ ఇష్టమైన కళాప్రక్రియ. వేదికపై ఓ వ్యక్తి నిలబడి తాను గానం చేస్తున్న హరికథలో వచ్చే పాత్రలన్నిటిని తానే ధరించి నటించి చూపాలి. అందుకే సర్వకళల సమాహారమే ఈ హరికథ గాన ప్రక్రియ. ఈ హరికథను తెలుగువారి సంస్కృతి చమత్కారంగా భావిస్తారు. కళలకు ఆదరణ తగ్గిపోతున్న సమయంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యం కలిగి భగవన్నామస్మరణ చేస్తూ, పట్టు వస్త్రాలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టి, నొదుట నామాన్ని దిద్దుకొని, చేతిలో చిరుతలు పట్టుకొని, హరినామ స్మరణ చేస్తూ, హరికథ ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు జనగామ జిల్లాకు చెందిన హరికథకుడు బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్. బొడిగె అంజమ్మ, శివయ్య దంపతులకు 1954 సెప్టెంబరు 25న జన్మించిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్ పట్టా పుచ్చుకొని హరికథా గానంతో జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రముఖ తెలుగు పండితులు పండితారాధ్యుల రామగిరి నాగయ్య శాస్త్రి, ప్రముఖ సంస్కృత పండితులు, దేవీ ఉపాసకులు మాదవపెద్ది చిన వెంకన్న శాస్త్రి, ప్రముఖ రచయిత నెల్లుట్ల నర్సింహారావు లక్ష్మీనారాయణకు సాహిత్య గురువులు. 40ఏళ్లుగా రాజరాజేశ్వరీదేవి అమ్మవారినే ధ్యానిస్తూ హరికథ కళారంగంలో ఒడిదుడుకులు ఎదురైనా ఆ కళామతల్లికి సేవలోనే ఉన్నారు.

ప్రదర్శనలు.. సత్కారాలు.. అవార్డులు..

లక్ష్మీనారాయణ తన 14వ యేట 7వ తరగతి చదువుతున్న రోజుల్లో తల్లిదండ్రులతో కలిసి భద్రాచల దేవస్థానానికి వెళ్లి ఆ పవిత్రమైన గోదావరి నదీ తీరాన 'శ్రీ సీతారామ కళ్యాణం', 'భద్రాద్రి వైభవం' అనే సంగీత రూపకాన్ని రచించి స్థానిక చెన్న కేశవ స్వామి భజన మండలిలో చేరి అనేక వేదికల ద్వారా గానం చేశారు. 1972లో హైద్రాబాద్ ఆకాశవాణి, యువవాణిలో ఈ రూపకాన్ని గానం చేశారు. 1973లో స్థానిక నాటక కళాసంస్థ శ్రీ నటరాజ కళానికేతన్‌లో గాయకుడిగా చేరి తన గాన కళను అభివృద్ధి చేసుకున్నారు. 1975లో స్వతహాగా శ్రీ నటరాజ సంగీత విభావరి అనే పేరుతో ఒక సంస్థను స్థాపించి ప్రదర్శనలు ఇస్తూ ఔత్సాహిక గాయనీ గాయకులతో కలిసి భక్తి ప్రధానమైన సంకీర్తనలో కూడిన పాటక కచేరీలు చేశారు. ఆలిండియా రేడియో కేంద్రం ద్వారా అనేక ప్రత్యేక సంగీత రూపకాలైన నల్లనివాడు, దివ్య దీపావళి, హోలీ సంబరాలు, ఉగాది వేడుక, సంక్రాంతి సరదాలు, బతుకమ్మ సౌందర్యం మొదలగు రూపకాలు రచించి స్వయంగా సంగీతాన్ని సమకూర్చి ఆలిండియా రేడియో ద్వారా సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ద్వారా మైసూరు, మద్రాసు, మహారాష్ట్ర, బీహార్, ఛత్తీస్‌గడ్, రాయపూర్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో హరికథా గానం చేసి అనేక సత్కారాలు, బిరుదులు అందుకున్నారు.

ఓ వైపు ప్రదర్శనలిస్తూనే మరోవైపు హైద్రాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో హరికథ డిప్లొమా కోర్సు పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1995లో మద్రాసు భాగవతా సేవా మండలి వారితో సత్కారం అందుకున్న ఆయన.. ప్రముఖ సినీ నటుడు పొట్టి ప్రసాద్ చేతుల మీదుగా గానకోకిల బిరుదును అందుకున్నారు. కందుకూరి వీరేశలింగం జన్మదినం సందర్భంగా 2011లో నాటి ఏపీ ప్రభుత్వం తరపున కలెక్టర్ రాహుల్ బొజ్జా చేతుల మీదుగా రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు. 2013లో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని, 2015లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డితో సన్మానం అందుకున్నారు. 2024లో విజయనగరం ఆదిబట్ల నారాయణదాసు సంస్థ ఆధ్వర్యంలో హరికథా భాస్కర అనే బిరుదును, తాడేపల్లిగూడెంలో ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముఖ అంజనేయ రాజు సంస్థ ఆధ్వర్యంలో 'హరికథా గాన సరస్వతి', సిద్దిపేటలోని ఎస్ఎస్‌సీ ఛానల్ ఆధ్వర్యంలో 'హరికథా కేసరి' బిరుదులను అందుకున్నారు. యువ సంగీత దర్శకులు, కవి చిలుమోజు సాయికిరణ్ రచించిన కవనతీగ కవితా సంపుటి పుస్తకావిష్కరణ సందర్భంగా 'జీవిత సాఫల్య పురస్కారం', 'హరికథా కళాబంధు' బిరుదును పొందారు. తెలంగాణ సమైక్యతా వజ్రోత్సవాలను పురస్కరించుకొని నాటి ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య, జడ్పీ ఛైర్మెన్ పాగాల సంపత్‌రెడ్డి చేతుల మీదుగా ఘన సన్మానం పొందారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

భరత నాట్యమయూరి..

అలకనంద





ప్రశంసా పత్రాలు, అవార్డులతో అలకనంద

మల్హర్, ఆగస్టు 18 : ఆ చిన్నారి వయసు 12యేళ్లు. ఆరో తరగతి చదువుతోంది. తనకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువతో ఓ గురువు వద్ద నాట్యం నేర్చుకుంటూనే.. సోషల్‌మీడియాలో అందుబాటులో ఉన్న నృత్య సాధన వీడియోలు చూసి మరింత సాధన చేసింది. చిన్నవయసులోనే పలు వేదికలపై ప్రదర్శనలిచ్చి ఔరా అనిపించుకుంటోంది భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ అలకనంద రాథోడ్. శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ అనేక ప్రశంస పత్రాలు, అవార్డులతో పాటు ప్రముఖులు, సాహితీ ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలకనంద తండ్రి బానోత్ రాజ్‌కుమార్ మాజీ సైనికుడు, తల్లి దివ్య గృహిణి. ప్రస్తుతం వారు భూపాలపల్లిలో నివాసం ఉంటుండగా.. అలకనంద పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సాహిత్య రంగంలో పట్టున్న తండ్రి రాజ్‌కుమార్.. తన కూతురు అలకనందకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువను గుర్తించి.. రెండేళ్ల క్రితం పట్టణంలో నాని మాస్టర్ వద్ద చేర్పగా.. ఆయన శిక్షణ, సలహాలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అలకనంద సోషల్ మీడియాలో వివిధ నాట్యాల వీడియోలు చూస్తూ సాధన ప్రారంభించి నాట్యంపై పట్టు పెంచుకుంటోంది. ఈ క్రమంలోనే పలు వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇస్తూ సత్తా చాటుతోంది. భూపాలపల్లిలో సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో, శ్రీరామ నవమి ఉత్సవాలు, గణపతి నవరాత్రి ఉత్సవాలు, హైదరాబాద్ రవీంద్రభారతి, త్యాగరాయ గానసభల్లో నిర్వహించిన పలు జాతీయ స్థాయి నృత్య పోటీలు, ప్రదర్శనలు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బడాఖానా వేడుకలు, తదితర వేదికలపై నృత్య ప్రదర్శనలు చేసింది. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రశంసా ప్రతం, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ జన్మదిన వేడుకల్లో ప్రశంస పత్రం, ఉగాది పురస్కార వేడుకల్లో నాట్య కళా ప్రవీణ అవార్డు, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి ఆధ్వరంలో ఇటీవల గౌతమి నంది అవార్డు అందుకుంది. అలాగే జాతీయస్థాయి ఐకాన్ అవార్డు కూడా సొంతం చేసుకుంది. నాట్యంతో పాటు చదువులోనూ రాణిస్తున్న అలకనంద ఐఏఎస్ కావడమే లక్ష్యంగా తన భవిష్యత్‌కు బాటలు వేసుకుంటోంది.



జాతీయస్థాయి గౌతమి నంది అవార్డును అందుకుంటున్న అలకనంద

సౌకర్యాల లేమిలో గ్రంథాలయాలు

- నిధుల కొరతతో వసతులు కరువు
- తీవ్ర సిబ్బంది కొరత
- ఉన్నవారిపైనే పని భారం
- పదేళ్లుగా జరగని నియామకాలు
- పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నిర్వహణ



హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని జిల్లా క్రేంద గ్రంథాలయం

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలు నిధులలేమివల్ల అనేక సమస్యలతో కూనారిల్లుతున్నాయి. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు కనీసం సౌకర్యాలు కల్పించలేకపోతున్నాయి. ఆరేళ్లుగా గ్రంథాలయాలకు బడ్జెట్ రావడం లేదు. దీంతో కరెంట్ బిల్లులు కట్టలేని దయనీయ స్థితి నెలకొన్నది. బిల్లులు చెల్లించకపోతే కరెంట్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ సంస్థ ఇప్పటికే వీటికి రెండు మూడు సార్లు నోటీసులు జారీ చేసింది. గ్రంథాలయాలకు పేపర్ బిల్లులు చెల్లించడానికి కూడా డబ్బులు లేవు. ఆరు నెలలుగా పేపర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పేపర్‌బాయ్‌లు బిల్లుల కోసం కాళ్లరిగేలా తిరుగు తున్నారు. బిల్లులు ఎంతకూ చెల్లించకపోవడంతో కొన్ని చోట్ల గ్రంథాలయాలకు పేపర్లు వేయడాన్ని మానుకున్నారు. కాలిపోయిన బల్బులను మార్చాలన్న, విరిగిపోయిన కుర్చీలకు మరమ్మతులు చేయించాలన్నా కూడా డబ్బులు లేక ఉద్యోగులు సతమతమవుతున్నారు.

వెల్లువలా ఉద్యోగార్థులు

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ అవుతున్నాయి. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో గ్రంథాలయాలకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలు అభ్యర్థులతో కిటకిటలాడు తున్నాయి. కూర్చోవడానికి కుర్చీలు కూడా సరిపోవడం లేదు. సరిపోయేన్ని కుర్చీలు సమకూర్చడానికి గ్రంథాలయాల వద్ద డబ్బుల్లేవు. దీనితో పాఠకులు ఏదోవిధంగా సర్దుకొని కూర్చొని చదువుకుంటున్నారు. పాఠకులకు కావలసిన స్టడీ మెటీరియల్ కోసం మార్కెట్‌లోకి వచ్చిన కొత్త పుస్తకాలను గ్రంథాలయాలు సమకూర్చలేకపోతున్నాయి. పాత పుస్తకాలతోనే పాఠకులు ఎలాగోలా సర్దుకుపోతున్నారు. కొత్త పుస్తకాల కోసం ఇండెంట్ పెడితే ఎప్పుడో గానీ రావడం లేదు. పాఠకులు డిమాండ్ బుక్‌లో రాసిన ఏ నెల రోజులకో గానీ అందడంలేదు. ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులు కరెంట్ అఫైర్స్ కోసం ఎక్కువగా వివిధ పత్రికలపై ఆధారపడుతుంటారు. ఎన్ని ఎక్కువ పత్రికలు చదివితే అంత తాజా మెటీరియల్ దొరుకుతుంది. కానీ డబ్బులు లేక ఏవో గ్రంథాలయాలు ఏవో కొన్ని పత్రికలను మాత్రమే పాఠకులకు సమకూర్చగలుగుతున్నాయి.

తీవ్ర సిబ్బంది కొరత

గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టేంత మంది మాత్రమే ఉన్నారు. లైబ్రరీలన్నీ ఐట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నడుస్తున్నాయి. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో సహా ఆరు జిల్లా గ్రంథాలయాలు, 50 మండల కేంద్రాల్లో 50 బ్రాంచ్ లైబ్రరీలు ఉన్నాయి. మండలాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఇప్పటి వరకు లైబ్రరీల ఏర్పాటు జరగలేదు. ఈ మండలాలకు చెందిన పాఠకులు పొరుగు మండలాలలోని లైబ్రరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉద్యోగ నోటిఫికేషన్ల వల్ల ఈ గ్రంథాలయాలు కూడా నిరుద్యోగ పాఠకులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. ఈగ్రంథాలయాల్లో 150 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 21 మంది మాత్రమే ఉన్నారు. ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు మరో 50 మంది ఉన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారి నియామకాలు జరగటం లేదు. 1993 నుంచి కొత్త రిక్రూట్‌మెంటే లేదు. ప్రతీ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 25 నుంచి 30 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 50మందికిపైగా ఔట్‌సోర్సింగ్, లేదా పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉండాలి. అలాగే మండల కేంద్రంలోని బ్రాంచ్ లైబ్రరీలో 5గురు రెగ్యులర్ ఉద్యోగులు, 10 మంది ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా కేంద్ర గ్రంథాలయాల్లో 10 మందికన్నా తక్కువగా రెగ్యులర్ ఉద్యోగులు, 15 మంది వరకు ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పలు గ్రంథాలయాల్లో స్వీపర్లు లేరు. కొన్ని లైబ్రరీలను ఊడ్చేపనిని పార్ట్‌టైమ్ ఉద్యోగులే చేస్తున్నారు.

చైర్మన్లు లేరు..

జిల్లా కేంద్ర గ్రంథాలయాలకు చైర్మన్లు లేరు. గత బీఆర్ఎస్ హయాంలో నియమితులైన చైర్మన్లు రాజీనామా పెట్టడంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. హనుమకొండలోని బీఆర్ఎస్ సర్కా రు హయాంలో నియమితులైన జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్ లోక్‌సభ ఎన్నికల ముందు తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి ఈ లైబ్రరీకి చైర్మన్ లేదు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన తర్వాత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఉద్యోగార్థులంతా లైబ్రరీలకు వెల్లువలా వస్తున్నారు. పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించలేని గ్రామీణ నిరుపేద నిరుద్యోగులు స్టడీ మెటీరియల్ కోసం లైబ్రరీలనే ఆశ్రయిస్తున్నారు. ఈ దృష్ట్యా వాటిని పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. సిబ్బంది కొరతను తీర్చాలని కోరుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతి సంబురం

ఉమ్మడి జిల్లాలో 476 మంది జెఎల్ఎంలకు ఏఎల్ఎంలుగా పదోన్నతి



ఏడీఈ నుంచి ఏఎల్ఎంగా ఆర్డర్ కాపీని అందుకుంటున్న దృశ్యం

హనమకొండ టౌన్, ఆగస్టు 18: జేఎల్ఎంలకు ఏఎల్ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని డివిజనల్ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసి సిబ్బందికి ఆర్డర్ కాపీలను అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు చేపట్టాలని, మరోవైపు ఎస్సీ, ఎస్టీ అసోయేషన్లు మాత్రం రిజర్వేషన్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోర్టుకు వెళ్లాయి. కోర్టు తీర్పు పెండింగ్‌లో ఉండటంతో యాజమాన్యం బదిలీలు ముందుగా చేపట్టాలని ఆలోచనకు వచ్చింది. ఈక్రమంలోనే ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై జాక్‌గా ఏర్పడి ముందుగా పదోన్నతులపై దృష్టి సారించాలని సీఎండీ వరుణ్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు.

కాగా, పదోన్నతులపై కోర్టు వెలువరించే తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు తదుపరి చర్యలు తీసుకోబడుతాయని షరతులు విధిస్తూ అర్హత ఉన్న ప్రతీ జెఎల్ఎంకు ఏఎల్‌యంగా పదోన్నతి కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న దగ్గరే విధులను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఉద్యోగ సంఘాల చొరవ, కంపెనీ నిర్ణయంతో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి 5 జిల్లాల్లో 2,361 మంది జెఎల్ఎంలు ఏఎల్‌యంలుగా పదోన్నతి పొందగా, ఉమ్మడి వరంగల్‌లో 476 మంది ఏఎల్ఎంలుగా పదోన్నతి పొందారు. వారిలో హనుమకొండ-119, వరంగల్ -101, జయశంకర్ భూపాలపల్లి, ములుగు- 98, జనగామ- 73, మహబూబాబాద్- 85మంది పదోన్నతి పొందారు.

మల్లన్నకు రూ.10 లక్షల రథం బహుకరణ

ఐనవోలు, ఆగస్టు 18 : ఐనవోలు మల్లికార్జునస్వామికి భక్తుడు రథం బహూకరించాడు. సుమారు రూ.10 లక్షల విలువచేసే రథాన్ని టేకు కర్రతో కళాకృతి ఉట్టిపడే విధంగా తయారు చేయించారు. హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన మల్లన్న భక్తులైన తాటికొండ రమాదేవిమల్లేశం దంపతులు తమ కుమారులైన కీ.శే. రాజు, రంజిత్‌ల జ్ఞాపకార్థం రథాన్ని ఆలయానికి తయారు చేయించి ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం రథంను ఆలయానికి అందజేయగా ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు రథంను శుద్ధిచేసి గణపతిపూజ, పుణ్యాహ వచనం పూజలు చేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంలో పెట్టి మాడ వీధులగుండా ప్రదక్షిణలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలైన మల్లేశం దంపతులకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దాత బహుకరించిన రథంను ప్రారంభిస్తున్న ఈవో, అర్చకులు

ఆరోగ్యశ్రీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

లేకుంటే ఈ నెల 20 తర్వాత సమ్మె

వరంగల్ మెడికల్, ఆగస్టు 18: రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలని, ఆరోగ్య మిత్రలకు కూడా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షురాలు శిరీష డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 20 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాలకు ఇప్పటికే పలుమార్లు కలిశామని, అయినప్పటికీ తమ జీతాల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ జీతంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వాపోయారు. 17 ఏళ్ల నుంచి అరకొర జీతంతో అలమటిస్తున్న తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీవో 60 ప్రకారం రూ.22,750 వేతనం తక్షణమే చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కనీస వేతనాన్ని రూ.35వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

కవులు కలాలను ఎత్తాలి..

అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18: పాలకుల నియంతృత్వ పోకడలను నిరసిస్తూ కవులు తమ కలాలను ఎత్తాలని అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బీఎడ్ కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం నిధి బ్రహ్మచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ.. బ్రిటీష్ వలసవాద దోపిడీని, దౌర్జన్యాల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో ప్రభావితమై జాతీయ వాద భావజాల స్ఫూర్తితో కాలాన్ని, గళాన్ని ఎత్తడం కోసం 1936లో ఆవిర్భవించిన సంఘం అభ్యుదయ రచయితల సంఘం అని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వెంకటి, మహ్మద్ సిరాజొద్దీన్‌లు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లా అరసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, సహ అధ్యక్షులుగా చందనాల సుమిత్ర, ఉపాధ్యక్షులుగా ఆనందాచారి, కాసుల రవికుమార్, సోమ నర్సింహచారి, చాగంటి కిషన్, రసూద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా గజ్జెల స్వరూపరాణి, సహాయ కార్యదర్శులుగా నరేందర్‌రెడ్డి, రాజు, సోమేశ్వరాచారి, రంగాచారి, లెనిన్, క్రాంతి కుమార్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝూ ● పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 4కే రన్



4కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌లు, సీపీ

బాలసముద్రం, ఆగస్టు 18: వరంగల్ నగరాన్ని డ్రగ్స్‌ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ వెల్లడించారు. ఆదివారం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 4కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ కలెక్టర్‌లు పి.ప్రావీణ్య, డాక్టర్ శారద, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో పాటు జబర్దస్త్‌ఫేం అదిరే అభి ముఖ్య అతిథులుగా పాల్గొని 4కే రన్‌ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 4కే రన్‌లో పోలీసులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌నుంచి అదాలత్ సెంటర్ వరకు, తిరిగి అక్కడి నుంచి పోలీస్ పరేడ్‌గ్రౌండ్ వరకు 4కే రన్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా నగదు పురస్కారాలను అందించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌ను వ్యతిరేకించాలని, డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నియంత్రించేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను సేవించేవారిని వాటినుంచి దూరం చేసేందుకు అందరు ప్రయత్నించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తోపాటు ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణరెడ్డి, పి.కిషన్, సతీష్‌కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఏడీలు

ఆర్జేడీ కార్యాలయంలో పర్యవేక్షణ కరువు



ఏడీ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీలు) కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 19 జిల్లాలకు పర్యవేక్షక కార్యాలయంగా ఉంటున్న ఆర్జేడీ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన ఏడీలు.. ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో సిబ్బంది జీతభత్యాలకు సంబంధించిన బిల్లులను చేయాల్సిన డీడీవోగా బాధ్యతలు ఉన్న ఏడీ కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక స్థానికంగా ఉండే మరో ఏడీ ఆయన ఎప్పుడు వస్తారో తెలియదని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఉండే సదరు అధికారి అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఇక మరో ఏడీ స్థానికంగానే ఉంటూ కార్యాలయానికి రావడం లేదనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా ఈ మధ్యనే కార్యాలయానికి బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ అదే దారిలో వెళుతున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ కరువు

ఏడీల విషయం తెలిసినా ఆర్జేడీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆర్జేడీ వివిధ జిల్లాల్లో పర్యటించిన సందర్భంలోనూ ఏడీల గైర్హాజరుపై దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా విధులకు రాకుండానే వేతనాలు అందుకుంటున్న ఏడీలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.

సర్దార్ పాపన్నకు ఘన నివాళి



భూపాలపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మంగపేటలో గౌడ సంఘం ర్యాలీ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 18: సర్వాయి పాపన్న జయంతి వేడుకలు సమీకృత కలెక్టరేట్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దోపిడీ వ్యవస్థకు ఎదురుతిరిగి పోరాడిన గొప్ప వీరుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. నేటితరం యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ మాట్లాడుతూ సర్వాయి పాపన్నను ఒక కులానికి పరిమితం చేయకుండా బహుజనుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తిగా కీర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ, బహుజన సంఘాల నేతలు జంపన్న, కొమురయ్య, ప్రభాకర్ గౌడ్, భార్గవ్, శ్యామ్, సంతోస్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● భూపాలపల్లిటౌన్: సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు భూపాలపల్లి పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని జవహర్‌కాలనీ సమీపంలో ప్రధాన రోడ్డు మీద నిర్మించిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, వివిధ కుల సంఘాల నాయకులు శ్రీపతి ప్రభాకర్‌గౌడ్, బుర్ర కొంరయ్య, ముద్దమల్ల భార్గవ్, అజ్మీరా జంపన్న, కోల శ్యాం, వేముల రాజమౌళి, సాంబమూర్తి, కుమారస్వామి, ఇర్ఫాన్, వెంకటనారాయణ, ముంజాల రవీందర్, సుభాష్, సారయ్య, దాసరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● టేకుమట్ల: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సర్వాయి పాపన్న మోకుదెబ్బ సంఘం జిల్లా నాయకులు పోన్నం బిక్షపతి, గౌడ సంఘం నాయకులు చిరంజీవి, రామకృష్ణా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, సంతోష్, వివిధ గ్రామాల గౌడ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు, మండల, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మండల కేంద్రంలో గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, గౌడ సంఘం నాయకులు గుర్రపు తిరుపతి, బుర్ర శ్రీనివాస్, గుర్రపు రాజేందర్, మల్లేష్, రమేష్, రవీందర్, ఉయ్యాల రమేష్, బుర్ర రాజ్‌కుమార్, సురేష్, కరుణాకర్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గుమ్మడి సత్యనారాయణ, అల్లకొండ కుమార్, గడ్డం కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పాపన్న జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు అనుప మహేష్, నాయకులు గుండ సురేష్, కంచు కుమారస్వామి, వల్లాల ప్రవీణ్, సాద సదానందం, ప్రబాకర్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట : సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ తీశారు. తెలంగాణ ఏజెన్సీ గౌడ్ హక్కుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బూర లక్ష్మీనారాయణగౌడ్, ములుగు జిల్లా అధ్యక్షుడు కారుపోతుల నర్సయ్యగౌడ్, సంఘం మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు లోడే శ్రీనుగౌడ్, రావుల సత్యంగౌడ్, పూజారి రాజుగౌడ్, బండపెల్లి నర్సయ్యగౌడ్, చీకట్ల యాకస్వామిగౌడ్, కారుపోతుల ఏకాంబ్రంగౌడ్, రావుల కోమురయ్యగౌడ్, చామకూరి కృష్ణయ్యగౌడ్, రామగాని నరేందర్‌గౌడ్, బోంబోతుల మురళిగౌడ్, చామకూరి బీమయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి దివ్యాంగ లబ్ధిదారుల ఎంపిక

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 18: దివ్యాంగుల సహాయ ఉపకరణాల కోసం ఈనెల 21, 22, 23 తేదీల్లో అలింకో ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21న ములుగులోని బండారుపల్లి రోడ్డులో గిరిజన భవన్, 22న గోవిందరావుపేట మండలం పస్రా గ్రామపంచాయతీ, 23న ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో ఎంపిక శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

నేటి 'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 18: సమస్యల పరిష్కారం కోసం ములుగు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులతోపాటు తొమ్మిది మండలాల్లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు విధిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం


గెలుపొందిన జట్టును అభినందిస్తున్న ఎస్సై

గోవిందరావుపేట, ఆగస్టు 18: యువత గంజాయి, మత్తుపదార్థాలకు బానిస కావొద్దనే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు పస్రా ఎస్సై కమలాకర్ ఆదివారం బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రంగాపూర్ జట్టు గెలుచుకోగా షీల్డ్‌తోపాటు రూ.5వేల నగదు, రెండో బహుమతి చల్వాయి జట్టు గెలుచుకోగా షీల్డ్‌తోపాటు రూ.3వేల నగదు, తృతీయ బహుమతి మొద్దులగూడెం జట్టుకు షీల్డ్‌తోపాటు రూ.2వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం


కలపను స్వాధీనం చేసుకుంటున్న అటవీ శాఖ అధికారులు

వెంకటాపురం(నూగూరు),ఆగస్టు 18: మండలంలోని తిప్పాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీ శాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఆలుబాక సెక్షన్ అధికారి చంద్ర మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పాపురం అటవీ ప్రాంతం నుంచి బొలెరో వాహనంలో టేకు కలపను తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో అటవీశాఖ అధికారులను గమనించిన స్మగ్లర్లు కలపతో ఉన్న వాహనాన్ని వదిలేసి పారిపోయారు. దీంతో వాహనాన్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న టేకు కలప విలువ రూ.2లక్షల 50 వేలు ఉంటుందని చంద్రమోహన్ తెలిపారు. ఈదాడుల్లో అటవీశాఖ సిబ్బంది మౌనిక, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏకాహం భజన


ఏకాహం భజనలో భక్తులు

కాటారం, ఆగస్టు 18: మండల కేంద్రంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఏకాహం భజన కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రావణమాసం పురస్కరించుకుని చెన్నూరు ఆర్కెస్ట్రా బృందంతో పాటు స్థానిక భజనపరులు 24గంటల పాటు ఏకబిగిన తబలా, తాళం, హార్మోనియం వాయిస్తూ భజన చేశారు. అంతకుముందు ఆలయంలో భక్తులు, హనుమాన్ దీక్షాపరులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ప్రతి ఏటా ఏకాహం భజన కార్యక్రమం జరపడం ఆనవాయితీ అని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం వలస వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, తోట సతీష్ తదితరులు పులిహోర, అరటిపండ్లు భక్తులకు అందించారు.

గుడుంబా తరలిస్తున్న నలుగురి అరెస్టు

వాజేడు, ఆగస్టు 18: గుడుంబాను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను మండలంలోని పేరూరు పోలీసులు అరెస చేశారు. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని టేకులగుడెం వద్ద ఆదివారం వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో పోలీసులను చూసి నలుగురు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించి పట్టుకోగా వారి వద్ద 10 ప్లాస్టిక్ కవర్లలో నాటుసారను గుర్తించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అక్రమంగా గుడుంబాను తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద ఉన్న 160 లీటర్ల నాటు సారాతో పాటు రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో మండలంలోని చిన్నగొల్లగూడేనికి చెందిన తాడూరి రవీందర్, ధర్మవరం గ్రామానికి చెందిన దాగం మధుసూదన్, పేరూరుకు చెందిన తల్లడి ప్రశాంత్, పూసూరుకు చెందిన కుర్సం నరేష్‌గా గుర్తించారు. వీరిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. హెచ్‌సీ కె.సాంబశివరావు, పీసీలు పి.నరేష్, టి.మారేశ్వరరావు, ఎ.వెంకటేశ్వర్లు, జి.నవీన్‌పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగించిన ఎస్సై

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 18: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఏడాది పోగొట్టుకున్న నలుగురు వ్యక్తుల సెల్‌ఫోన్లను గుర్తించి ఆదివారం అప్పగించారు. ఈమేరకు ఎస్సై కొప్పుల తిరుపతిరావు తెలిపారు. మండలంలోని చొక్కాల, బీసీమర్రిగూడెం, మండల కేంద్రానికి చెందిన గౌరారపు కృష్ణ, గగ్గూరి రమేష్, కొప్పుల మహేష్, మారిశెట్టి పార్థసారథి సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారని అన్నారు. దీంతో వారు ఫిర్యాదు చేయగా సీఈఆర్ఐ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి అందజేసినట్లు పేర్కొన్నారు.

కాటారంలో..

కాటారం: పోగొట్టుకున్న, చోరీకి గురైన రెండు సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి ఆదివారం అందజేశారు. మండలంలోని జాదరావుపేట గ్రామానికి చెందిన కటుకు సతీష్, దామెరకుంటకు చెందిన పెంట రవి తమ ఫోన్లను పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందించినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రికవరీ ఇన్‌చార్జి, డబ్ల్యూపీసీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బంజరుదొడ్డికి పశువులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాటారం, ఆగస్టు 18: మండల కేంద్రంలో 353(సీ) జాతీయ రహదారి, కాటారం-మంథని ప్రధాన రహదారిపై తిరుగుతున్న పశువులను పంచాయతీ అధికారులు, సిబ్బంది ఆదివారం బంజరుదొడ్డికి తరలించారు. కొన్ని నెలలుగా పశు వులు రోడ్లపై సంచరిస్తూ వాహనదారులు ప్రమా దాలపాలవడానికి కారణమవుతున్న నేపథ్యంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'జాతీయ రహదారిపై పశు వుల సంచారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి స్పందించారు. పశువుల సంచారాన్ని ప్రత్యక్షంగా చూసి చర్యలు చేపట్టాలని కార్యదర్శి నఫీర్‌ఖాన్‌ను ఆదేశించారు. దీంతో కార్యదర్శి, సిబ్బంది కొంతమంది పశువుల యజమానుల ఇళ్లకు వెళ్లి పశువులను రోడ్లపై వదిలేయకుండా ఇళ్ల వద్ద కట్టేసుకోవాలని, కాపలాదారులను పెట్టుకోవాలని తెలిపారు. అయినా వారు పట్టించుకోకుండా అలాగే పశువులను రోడ్లపై వదిలిపెడుతుండగా ఆదివారం పంచాయతీ సిబ్బంది వాటిని పాత గ్రామపంచాయతీ ఆవరణలోని బంజరుదొడ్డిలోకి తరలించారు. వాటికి మేత, నీళ్లు అందించారు. వారం రోజుల వరకు పశువులను వాటి యజమానులు జరిమానా కట్టి తీసుకెళ్లకుంటే బహిరంగ వేలం విధిస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క


పాపయ్యపల్లిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 18: గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, గ్రంథాలయాన్ని కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడారు. గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, ఇప్పటికే రూ2కోట్ల15లక్షల నిధులతో పాలంపేట రోడ్డు మరమ్మతులు చేపట్టడం జరిగిందని, శ్మశానవాటిక నిర్మాణ పనులు కూడా త్వరలోనే పూర్తిచేస్తామని అన్నారు. అదే విధంగా నూతన గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకా లను పరిశీలించారు. అనంతరం మహిళలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆడబిడ్డల్ని గౌరవిస్తూ, రక్షిస్తూ వారికి అండగా నిలుస్తూ అన్నిరంగాల్లో ప్రోత్సాహం కల్పిస్తూ ఎదగనివ్వాలని అన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ పాపయ్యపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ భవనానికి భూమి విరాళంగా ఇవ్వడం సంతోషకరమని, గ్రామంలో సొంత నిధులతో భూమితోపాటు భవనం నిర్మించి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి బహుమానంగా ఇచ్చిన తూడి రవీందర్‌రెడ్డి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, సీఈవో సంపత్ రావు, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, డీడబ్ల్యూవో స్వర్ణలతలెనిన, స్థల, భవన నిర్మాణదాతలు తూడి రవీందర్‌రెడ్డి, సుకేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మందల లక్ష్మి, వివిధశాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, మిల్కూరి ఐలయ్య, మాడుగుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి తీజ్ ఆహ్వాన పత్రిక అందజేత

ములుగు కలెక్టరేట్ : ఈనెల 22న జరిగే తీజ్ ముగింపు ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మంత్రి సీతక్కతోపాటు అధికారులకు బంజార ఐక్యవేదిక నాయకులు పోరిక మోహన్‌లాల్, అంగోత్ రాజునాయక్, పోరిక సునీల్‌కుమార్, పాడ్య కుమార్ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మంత్రిని, కలెక్టర్‌ను అందజేశారు.

గెస్ట్ లెక్చరర్ల వినతి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ గెస్ట్‌లెక్చరర్లు ములుగులో మంత్రి ధనసరి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకుడు భాషవేని దేవేందర్ మాట్లాడుతూ పీరియడ్ విధానాన్ని తొలగించి నెల వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైంస్కేల్ విధానంలో బేసిక్ పే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు రామిని రణధీర్, రాజేందర్, లక్ష్మణ్, రాజు, సబిత, కిరణ్, శ్రీనివాస్, కృష్ణ, నిష, ప్రత్యూష, వందన, శ్వేత, కవిత, దివ్య, అనిత, నందిని, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాలకు ఆత్మీయ వీడ్కోలు


సీఆర్‌పీఎఫ్ బలగాలను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కాటారం, ఆగస్టు 18: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో 58జీ బెటాలి యన్ సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లకు సివిల్ పోలీస్ అధికారులు ఆది వారం ఘనంగా సన్మా నించారు. కొన్నేళ్లుగా అంకిత భావంతో విధులు నిర్వర్తించి ఇక్కడి నుంచి ఇతర ప్రాంతానికి తరలి వెళ్తున్న నేపథ్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. సీఆర్‌పీఎఫ్ అందించిన సేవలను ఈ సంద ర్భంగా డీఎస్పీ గడ్డం రామ్మోహ న్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ కొనియాడారు. విధి నిర్వహణలో భాగంగా సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లతో నెలకొన్న బంధాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఏసీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడి దామోదర్‌రెడ్డి సస్మరణ సభ

మంగపేట, ఆగస్టు 18: రైతు నాయకుడు పాడి దామోదర్‌రెడ్డి సస్మరణ సభ ఆదివారం మండలంలోని అకినేపల్లి-మల్లారంలో ఆదివారం జరిగింది. రైతుల కోసం దామోదర్‌రెడ్డి చేసిన పోరాటాన్ని వక్తలు కొనియాడారు. జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ త్వరలో పాడి దామోదర్‌రెడ్డి పేరిట స్మారక క్రీడా పోటీని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాసిరెడ్డి వినయ్‌కుమార్‌రెడ్డి, నాగిరెడ్డి, మైత్రి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంగళ బుచ్చిరెడ్డి, కందుల రమణారెడ్డి, అప్పినబోయిన నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేదెన్నడు?


కంకర తేలిన రోడ్డు

కాటారం, ఆగస్టు 18: కాటారం-విలాసాగర్ రోడ్డు విస్తరణ పనులు మూడేళ్లుగా నత్తనడక సాగుతున్నాయి. 11కి.మీ మేర చేయాల్సిన రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామాల పరిధిలో సీసీ రోడ్లు వేసిన కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాల్లో మాత్రం తారు పూర్తిగా తీసేసి కంకర పోసి వదిలేశాడు. దీంతో వాహనదారులు కంకర రోడ్డుతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మండలంలోని కాటారం నుంచి విలాసాగర్ వరకు వయా గుమ్మళ్లపల్లి మీదుగా రహదారి విస్తరణ (ఐదున్నర మీటర్లు) కోసం పీఎంజీఎస్‌వై (ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజన)-3 బ్యాచ్-2 కింద రూ.9 కోట్ల 5 లక్షల 50 వేలు మంజూరయ్యాయి. 2021 సెప్టెంబరులో అప్పటి పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్, పెద్దపల్లి, భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్లు పుట్ట మధు, జక్కు శ్రీహర్షిణి రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం 11కిలోమీటర్ల మేర చేపట్టిన రహదారి విస్తరణ పనులు ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టు పొందిన నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో తారు రోడ్డు నిర్మాణం పూర్తికాక కంకరతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆక్రోశిస్తున్నారు. గ్రామాల పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణం జరగడంతో వాహనదారులు వేగంగా వచ్చి కంకరరోడ్డుపై కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి విస్తరణ పనులు పూర్తయ్యేలా చూడాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

పెద్ద తాడిచర్లలో తాగునీటి తండ్లాట

మల్హర్, ఆగస్టు 18 : మండలంలోని పెద్ద తాడిచర్ల వాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మంచినీటిని అందించే మానేరు బోరు మోటార్ పైప్‌లైన్ వరదకు కొట్టుకుపోయింది. దీంతో వారం రోజులుగా తాగునీటి కష్టాలు తప్పడం లేదు. తాడిచర్ల ఓసీపీ నీటిని మానేరుకు కాల్వ ద్వారా తరలిస్తున్నారు. కాల్వ తీసే సమయంలో ఓసీపీ అధికారులకు మంచినీటి పైప్‌లైన్ కనిపించలేదా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా వారం రోజులు గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోతోందని అంటున్నారు. ఓసీపీ వరద నీరు తాగునీరు అందించే బోరు చుట్టూ చేరడంతో తాగే నీరు కలుషితమవుతోందని అంటున్నారు. జీపీ అధికారులు, సిబ్బంది నీటి సరఫరాకు ప్రయత్నం చేస్తున్నా కాల్వలో ప్రవాహం వల్ల పైప్‌లైన్ ఆగడం లేదు. ఈ కాల్వ వల్ల వైకుంఠధామం కూడ ధ్వంసమయ్యేట్టు ఉంది. జిల్లా అధికారులు స్పందించి వేరే వైపు మళ్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'ఆ ఆరోపణలు అవాస్తవం'

టేకుమట్ల, ఆగస్టు 18: తనపైబీ బీజేపీ నాయకులు చేసిన ఆరోప ణలు అవాస్తవమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ అన్నారు. మరోమారు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. మండలంలోని కుందనపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి, నాయకులు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం మాట్లాడుతూ తాను ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు చేశారని దుయ్యబట్టారు. ఇది అవాస్తవమని, ఆ మాటలను వారు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కుందనపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు పొన్నం సాంబయ్య, ఆరెపల్లి తిరుపతి, మాడుగుల వీరయ్య, అరకొండ రాజయ్య, దేవేందర్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో కోతుల స్వైర విహారం

మంగపేట, ఆగస్టు 18: మండలంలోని కమలాపురం మేజర్ గ్రామ పంచాయతీలో కొద్ది నెలలుగా కోతులు స్వైరవిహారం చేసి గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్నాయి. ఇళ్లలో చొరబడి అందినకాడికి ఎత్తుకెళ్లుతున్నాయి. ఇప్పటికే గ్రామంలో సుమారు 45 మందిపై దాడి చేశాయి. ఇదేక్రమంలో రెండు రోజుల్లో పలు వీధుల్లో పది మందిని గాయపర్చాయి. ఆదివారం మిరియం సత్యనారాయణ, పడమటింటి సత్యనారాయణలపై పడి తీవ్రంగా గాయపర్చాయి. కోతల నుంచి రక్షణ కల్పించాలని స్థానిక గ్రామపంచాయతీ అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. జీపీలో నిధులు సమకూరిన తర్వాత కోతల నివారణ చర్యలు చేపడుతామని అంటున్నారు. అయితే.. కొందరు గ్రామస్థులు ఇంటింటికీ చందాలు వేసుకొని కోతలను బోనుల్లో బంధించి అడవిలో విడిచిపెట్టేందుకు శ్రీకారం చుట్టారు. అయితే కొందరు స్వచ్ఛందంగా చందాలు ఇస్తుండగా, చాలా మంది ఇవ్వకపోవడంతో కోతలను పట్టేందుకు డబ్బులు సరిపోవడం లేదని వారు అంటున్నారు. దీంతో కోతలను పట్టలేకపోతున్నామని తెలిపారు. దీంతో ఉన్న కోతులు బాగా కోపంతో ఇళ్లల్లో చొరబడి గ్రామస్థులను ఇబ్బందులు పెడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కోతల నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుడుంబా, కోడి పందాల స్థావరాలపై పోలీసుల దాడులు

మంగపేట, ఆగస్టు 18: మండలంలోని రెండు గ్రామాల్లో వేర్వేరుగా పోలీస్ బృందంతో ఆదివారం సాయంత్రం దాడులు చేశామని ఎస్సై సూరి తెలిపారు. మండలంలోని రాజుపేట ఎస్సీకాలనీలో గుడుంబా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడులు నిర్వహించి ఇద్దరు వ్యాపారుల వద్ద 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిద్దరి కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. తిమ్మంపేట పరిసరా ప్రాంతాల్లో కొందరు కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారం అందగా, ఆ శిబిరంపై దాడి చేశామన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకోగా ఇంకొంతమంది పరారయ్యారని తెలిపారు. ఈ దాడిలో ఒక కోడిపుంజు, ఐదు మొబైల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు, రూ.1,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 18 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోకి 2.12 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి 3.40 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు.